నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు – తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059548848

అల్పపీడన ప్రభావం తెలంగాణలో వానలు

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ప్రజలకు వేడి నుంచి ఉపశమనం లభించింది. ఈ నెల 22వ తేదీ వరకు రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా–పశ్చిమబెంగాల్ తీర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర, మధ్య జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు లేకపోయినా, ఈ జల్లులు ఎండల తీవ్రతను తగ్గించి ప్రజలకు, రైతులకు కొంత ఊరటనిస్తున్నాయి.

హైదరాబాద్. ఎడిటర్:- వై. రమ నాగరాజు సంపుటి:-32 సంచిక:-218 శుక్రవారం 02- 10 - 2026

ఇరాక్‌పై అమెరికా, సౌదీ సంయుక్త దాడులు

- ఇరాక్‌లో ఇరాన్ అనుకూల గ్రూపులపై అమెరికా, సౌదీ అరేబియా వైమానిక దాడులు
- డ్రోన్ దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యలని ప్రకటించిన అమెరికా సెంట్రల్ కమాండ్
- ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను విజయవంతంగా అడ్డుకున్న అమెరికా బలగాలు
- పశ్చిమాసియాలో 20కి పైగా అమెరికా యుద్ధ నౌకల మోహరింపు
- దాడులు ఆపకపోతే మరిన్ని సైనిక చర్యలు తప్పవని ఇరాన్‌కు హెచ్చరిక

పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. తమ సైనికులు, సౌదీ అరేబియా ఇంధన వనరులే లక్ష్యంగా ఇరాన్ అనుకూల గ్రూపులు జరిపిన డ్రోన్ దాడులకు ప్రతిగా అమెరికా, సౌదీ అరేబియా బలగాలు సంయుక్త దాడులు చేపట్టాయి. తూర్పు ఇరాక్‌లోని ఇరాన్ మద్దతున్న గ్రూపులకు - మిగతా 2 లో

‘పీఓకే నిరసనకారులు కూడా భారత్‌లాంటి శత్రువులే’

నోరుపారేసుకున్న పాక్ రక్షణ మంత్రి

- పీఓకే నిరసనకారులపై ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు
- ‘భారత్‌లాంటి శత్రువులే’ అంటూ నోరుపారేసుకున్న రక్షణ మంత్రి
- పాక్ భద్రతా బలగాల కాల్పుల్లో 32 మంది మృతి
- ఇప్పటివరకు 90 మందికిపైగా మృతి చెందినట్లు నివేదికలు
- ఈ తరుణంలో ఖవాజా వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి తీవ్ర వివాదానికి దారితీశాయి. పీఓకేలో నిరసనలు చేపడుతున్న వారిని భారత్‌తో సమానంగా - మిగతా 2 లో

‘గజ్వేల్ గడీ’ తర్వాత ఇప్పుడు
‘సిరిసిల్ల గడీ’ని కూలుస్తాం

- రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు
- కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ
- బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు
- దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు

సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

నీటి చుక్క వాడకుండా అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ

- కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు
- మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు
- అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని CWPRS రిపోర్ట్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి చుక్క కూడా వాడకుండా భారతదేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అని - మిగతా 2 లో

రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే - మిగతా 2 లో

పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా

పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ - మిగతా 2 లో

రష్యన్ చౌక ఆయిల్‌పై టారిఫ్‌లు?

అమెరికా బిల్లుతో భారత్‌కు చిక్కులు!

- రష్యాపై కఠిన ఆంక్షల కోసం అమెరికా సెనేట్‌లో కీలక బిల్లు
- రష్యా నుంచి చమురు కొనే దేశాలపై 100 శాతం టారిఫ్‌లకు అవకాశం
- భారీగా రష్యా చమురు కొంటున్న భారత్‌పై తీవ్ర ప్రభావం పడే ఛాన్స్
- ఇంకా చట్టంగా మారని బిల్లు.. తుది నిర్ణయం అధ్యక్షుడిదే
- కొందరు చట్టసభ్యుల నుంచి వ్యతిరేకత.. బిల్లు భవిష్యత్తుపై అనిశ్చితి

రష్యాను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా సెనేట్ కీలక అడుగులు వేస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై కఠిన ఆంక్షలు విధించేందుకు ఉద్దేశించిన ఒక బిల్లుపై ఓటింగ్ జరపనుంది. ఈ బిల్లు చట్టంగా

రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

- రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం
- తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న
- రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ - మిగతా 2

ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి

- జాబ్ కేలండర్-2026 రెండో దశ ఉద్యోగాల భర్తీకి కొత్త తేదీ ఖరారు
- సెప్టెంబర్ 15న 3,168 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
- 3, 4 దశల్లోని 5,369 పోస్టులకు అక్టోబర్ 15న ప్రకటన
- ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశం
- మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన, సాంకేతిక - మిగతా 2 లో

ఏపీలో యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- అక్రమాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలన్న వైసీపీ
- జిల్లా కేంద్రాల్లో వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల నిరసనలు
- ప్రభుత్వం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని జగన్ ఆరోపణ

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ, స్పోర్ట్స్ కోటాలో జరిగిన అన్యాయం యువతలో - మిగతా 2 లో

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ

- మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!
- జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు
- సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య
- గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం

వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని

ఏపీలో యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది

మొదటిపేజీ తరువాయి – వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, ప్రజలతో కలిసి జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన నిరసన ర్యాలీలు విజయవంతమయ్యాయని జగన్ తెలిపారు. డీఎస్సీ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని యువత బలంగా డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా నియామకాల వరకు జరిగిన ప్రతి అక్రమంపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని ఆయన కోరారు. చంద్రబాబు ప్రభుత్వం లీకులు, అక్రమాలతో ప్రతిభావంతులైన యువత భవిష్యత్తును అంధకారం చేసిందని, వారిని రోడ్డున పడేసిందని జగన్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, మంత్రి లోకేశ్ గానీ నోరు మెదపకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

రైతులను ఆదుకోండి.. సీఎంకు సీపీఐ రామకృష్ణ వినతి

మొదటిపేజీ తరువాయి – మంగళవారం అమరావతిలోని సచివాలయంలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను రామకృష్ణ ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 జిల్లాల్లో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, 249 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రామకృష్ణ విన్నపంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఆగస్టు 3వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రామకృష్ణ ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

మొదటిపేజీ తరువాయి – గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (గ్రాఖూజా) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

ఇరాక్‌పై అమెరికా, సౌదీ సంయుక్త దాడులు

మొదటిపేజీ తరువాయి – చెందిన స్థావరాలపై మంగళవారం వైమానిక దాడులు జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఒక ప్రకటనలో తెలిపింది. గత 72 గంటల్లో ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఆదేశాలతో 30కి పైగా డ్రోన్ దాడులు జరిగాయని, వాటికి బదులుగానే ఈ ఆపరేషన్ చేపట్టామని సెంట్‌కామ్ పేర్కొంది. అమెరికా, సౌదీ యుద్ధ విమానాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయని, ఇరాన్ అనుకూల గ్రూపులు ఆయుధాలను నిల్వ ఉంచే ప్రదేశాలు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని వివరించింది. అయితే, ఈ దాడుల్లో జరిగిన నష్టం లేదా ప్రాణనష్టం వివరాలను సెంట్‌కామ్ వెల్లడించలేదు. ఇదే సమయంలో, పశ్చిమాసియాలోని అమెరికా బలగాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో దాడికి యత్నించిందని సెంట్‌కామ్ వెల్లడించింది. ఇరాన్ నుంచి ప్రయోగించిన అన్ని క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, తమ బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని స్పష్టం చేసింది. 2026 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో ఇరాన్ అనుకూల గ్రూపులు అమెరికా పౌరులు, ఆస్తులపై 600కు పైగా దాడులకు ప్రయత్నించాయని సెంట్‌కామ్ గుర్తుచేసింది. "ఐఆర్‌జీసీ, దాని ఉగ్రవాద ప్రాక్సీ గ్రూపులు ఈ దాడులను వెంటనే నిలిపివేయాలి, లేదంటే అమెరికా సైన్యం నుంచి మరిన్ని ప్రతిస్పందనలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని హెచ్చరించింది. మరోవైపు, మధ్యప్రాచ్యంలో 20కి పైగా అమెరికా యుద్ధనౌకలు సైనిక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాయని సెంట్‌కామ్ తెలిపింది. ఇరాన్‌పై 'స్టీల్ వాల్ దిగ్బంధం'ను కఠినంగా అమలు చేస్తున్నట్లు, ఇందులో భాగంగా జులై 28 నాటికి 18 వాణిజ్య నౌకలను దారి మళ్లించినట్లు పేర్కొంది.

రష్యన్ చౌక ఆయిల్‌పై టారిఫ్‌లు?

మొదటిపేజీ తరువాయి – మారితే, రష్యా నుంచి చౌకగా ముడి చమురును భారీగా కొనుగోలు చేస్తున్న భారత్ వంటి దేశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. ఈ బిల్లు ప్రకారం, రష్యా నుంచి పెద్దమొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభిస్తుంది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తున్న రష్యాకు ప్రధాన ఆదాయ వనరైన ఇంధన విక్రయాలను అడ్డుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ జాబితాలో భారత్, చైనా, జపాన్‌తో పాటు కొన్ని ఐరోపా దేశాలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారత్.. రష్యా నుంచి రాయితీ ధరలకు అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. ఈ బిల్లుకు 'లిండ్సే ఓ.గ్రాహమ్ సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' అని పేరు పెట్టారు. ఇది కేవలం రష్యానే కాకుండా, ఇరాన్‌ను కూడా లక్ష్యంగా చేసుకుంది. అమెరికా కాంగ్రెస్‌లో ఉక్రెయిన్‌కు గట్టి మద్దతుదారుగా నిలిచిన దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహం అంత్యక్రియలు జరుగుతున్న రోజే ఈ ఓటింగ్ జరగడం గమనార్హం. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వాషింగ్టన్‌లో పర్యటిస్తున్నారు. అయితే, ఈ బిల్లు చట్టంగా మారడానికి ఇంకా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం సెనేట్‌లో జరుగుతున్నది కేవలం ఒక ప్రక్రియపరమైన ఓటింగ్ మాత్రమే. ఇది సెనేట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ ఆమోదం పొందిన తర్వాతే అధ్యక్షుడు ట్రంప్ వద్దకు వెళ్తుంది. ఒకవేళ చట్టంగా మారినా, టారిఫ్‌ల విధింపు వెంటనే జరగదు. వాటిని ఎప్పుడు, ఎవరిపై విధించాలనే విచక్షణాధికారం అధ్యక్షుడికే ఉంటుంది. ఈ బిల్లుకు ఇరాన్‌పై ఆంక్షలను జోడించడంతో అధ్యక్షుడు ట్రంప్ మద్దతు తెలిపారు. కానీ, కొందరు డెమోక్రటిక్ చట్టసభ్యులు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని రాయిటర్స్ పేర్కొంది. ఈ బిల్లు అధ్యక్షుడికి అపరిమిత టారిఫ్ అధికారాలను కట్టబెడుతుందని, ఇది మిత్రదేశాలను సైతం ప్రభావితం చేయవచ్చని, అమెరికా వినియోగదారులపై భారం పడుతుందని వారు వాదిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ బిల్లు ప్రాథమిక దశలోనే ఉంది. దీని భవిష్యత్తు ప్రభావం కాంగ్రెస్ ఆమోదం, అమెరికా ప్రభుత్వ నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

'పీఓకే నిరసనకారులు కూడా భారత్‌లాంటి శత్రువులే'

మొదటిపేజీ తరువాయి – శత్రువులుగా చూస్తానంటూ నోరు పారేసుకున్నారు. పాకిస్థాన్ భద్రతా బలగాల కాల్పుల్లో గత రెండు రోజుల్లో పీఓకేలో కనీసం 32 మంది కశ్మీరీ నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఓ వీడియోలో ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ "అక్కడ నిరసన చేస్తున్న వారిని కూడా భారత్‌ను చూసినట్టే చూస్తాను. వాళ్లూ మా శత్రువులే" అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీఓకేలో శాంతియుతంగా నిరసనలు చేస్తున్న ప్రజలను శత్రువులుగా చిత్రీకరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 5 నుంచి పీఓకేలో హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు 90 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మీర్‌పూర్ నగరంలో భద్రతా బలగాలు ప్రజలపై నేరుగా కాల్పులు జరుపుతున్న దృశ్యాలు, మృతదేహాలను వాహనాల్లో తరలిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.

ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి – సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 అమలుపై ఆయన అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి పలువురు మంత్రులు ఆన్‌లైన్ ద్వారా హాజరు కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు. జాబ్ కేలండర్-2026లో భాగంగా ప్రకటించిన 10,060 ఉద్యోగాలను మొత్తం నాలుగు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15నే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టులకు వాస్తవానికి ఆగస్టు 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఎదురైన కొన్ని సాంకేతిక ఇబ్బందులు, ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం జరిగింది. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకున్న మంత్రుల బృందం, రెండో దశ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 15న విడుదల చేయాలని నిర్ణయించింది.

3, 4 దశల నోటిఫికేషన్లు అక్టోబర్‌లో

జాబ్ కేలండర్‌ను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా మూడు, నాలుగు దశల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఒకేసారి అక్టోబర్ 15న విడుదల చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. మూడో దశలో 2,388 పోస్టులు, నాలుగో దశలో 2,981 పోస్టులు భర్తీ చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయా శాఖల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీలను భర్తీ చేయాలని, ఆ దిశగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో దశలో భర్తీ చేయనున్న 3,168 పోస్టుల్లో అత్యధికంగా 2,225 పోస్టులు హోంశాఖ పరిధిలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రూప్-1లో ప్రస్తుతం గుర్తించిన పోస్టుల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని మంత్రుల బృందం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, సకాలంలో పూర్తి చేసి, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేసే సంప్రదాయాన్ని కొనసాగించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. జాబ్ కేలండర్-2026కు సంబంధించిన పూర్తిస్థాయి ఖాళీల వివరాలను ఈ నెల 6న జరగనున్న కేబినెట్ సమావేశం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు వంగలపూడి అనిత, పి. నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి రవి సుభాష్ పాల్గొన్నారు.

కాళేశ్వరం నుంచి నీటి చుక్క వాడకుండా అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ

మొదటిపేజీ తరువాయి – భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన వారం రోజుల్లోనే లీక్ అయిందన్నారు. ఈ విషయం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి కూడా తెలుసునని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. సుమారు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్ల వడ్డీ రూపంలో కడుతున్నామని వివరించారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పార్టీ పిచ్చి రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కానీ ఆ ప్రాజెక్ట్‌తో తాము అలాంటి రాజకీయాలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బాధ్యత లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. ఇసుకలో కాళేశ్వరం ఫౌండేషన్ వేశారని గుర్తు చేశారు. ఐఐటీ బాంబే ఆఫ్రి కంపెనీతో సాయిల్ టెస్ట్ చేయించామని పేర్కొన్నారు. బ్యారేజీలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని.. అంటే అది ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా అయితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కక్కుర్తి, అసమర్థత వలన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. అయితే కాళేశ్వరం విషయంలో తమకు రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని జస్టిస్ ఘోష్ రిపోర్ట్ ఇచ్చిందని గుర్తు చేశారు. చీణూగా మొదట ప్రిలిమినరీ రిపోర్ట్ నవంబర్ 23 ఇచ్చిందని అన్నారు. కమీషన్ల కోసం ఫౌండేషన్ చూసుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రూ. 1400 కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లు చెక్ రూపంలో ఇచ్చారని కల్వకుంట కవిత చెప్పారని..అది వాస్తవమని పేర్కొన్నారు. తనకు తెలిసి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ప్రాజెక్టు కూడా మేఘా సంస్థకు ఇవ్వలేదన్నారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐకి లేఖ రాశామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 24 గంటల్లో సీబీఐ విచారణ జరిపిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ధాన్యం కుంభకోణం చేసిన వారిని అరెస్ట్ చేస్తామన్నారు. ౹ాదీజ టన్నులు తమ హయంలో పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ

మొదటిపేజీ తరువాయి – రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

మొదటిపేజీ తరువాయి – వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

మొదటిపేజీ తరువాయి – మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగ నిర్వహణలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు చెందిన సంస్థకు కేటాయించడంపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచి, నీరు గోదావరి నది నుంచి సేకరిస్తున్నారని, అలాగే భూమి కూడా తెలంగాణదేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వనరులతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మన అవసరాలకు వినియోగించకుండా వేరే రాష్ట్రానికి కేటాయించడంపై నిలదీశారు. తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇవ్వడానికి సిద్ధపడటం దారుణమని హరీశ్ రావు అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని తన లేఖలో స్పష్టం చేశారు.

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా మద్ద అనిల్ కిషోర్

ఎస్సీ విభాగంలో నూతన నియామకాలు.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బండి రమేష్ పిలుపు......

కూకట్‌పల్లి నిలువుటద్దం ప్రతినిధి: మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గానికి నూతన కమిటీని ప్రకటించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమ దుర్గా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన నాయకులకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ నియామక పత్రాలను అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కన్వీనర్‌గా మద్ద అనిల్ కిషోర్ నియమితులయ్యారు. ఆయనతో పాటు పార్టీ ఎస్సీ విభాగంలో పలువురికి కీలక బాధ్యతలు అప్పగించారు. జిల్లా జనరల్ సెక్రటరీలుగా వి. యాదగిరి, టి. రాజు, జిల్లా సెక్రటరీగా ఏ. రాజు, కూకట్‌పల్లి వైస్ చైర్మన్‌గా వి. బాబ్జి, కూకట్‌పల్లి ప్రెసిడెంట్‌గా బి. రవి, బాలాజీనగర్ ప్రెసిడెంట్‌గా ఎం. రవి, కేపీహెచ్‌బీ ప్రెసిడెంట్‌గా పి. శామ్యూల్, కైతలాపూర్ ప్రెసిడెంట్‌గా ఎన్. నిఖిల్, మూసాపేట్ ప్రెసిడెంట్‌గా కె. నర్సింగ్ రావు, ఫతేనగర్ ప్రెసిడెంట్‌గా సిహెచ్. నరేష్, ప్రకాష్‌నగర్ ప్రెసిడెంట్‌గా జే. చంద్రశేఖర్, ఓల్డ్ బోయినపల్లి ప్రెసిడెంట్‌గా పి. సురేష్, హస్మత్‌పేట్ ప్రెసిడెంట్‌గా ఎం.ఎస్. అరవింద్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ నూతనంగా నియమితులైన నాయకులకు అభినందనలు తెలియజేశారు. పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు ఎస్సీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి నూతన కమిటీ నాయకులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నూతన బాధ్యతలు స్వీకరించిన మద్ద అనిల్ కిషోర్‌కు బండి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ

నాయకులు, కార్యకర్తలు ఘనంగా అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతలతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి 249వ డివిజన్ మాజీ అధ్యక్షుడు మేకల రమేష్, 249వ డివిజన్ అధ్యక్షుడు కావేటి నాగార్జున, 249వ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బచ్చల రవి, కృష్ణవేణి, రమాదేవితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాత నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
శుక్రవారం 02- 10 - 2026

ఖైత్లాపూర్ పిల్లి రాజు గారి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఖైత్లాపూర్ నివాసి, సీనియర్ నాయకులు శ్రీ పిల్లి రాజు గారి మాతృమూర్తి పరమపదించారన్న విషయం తెలుసుకుని, కూకట్‌పల్లి నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు శ్రీ మాధవరం కృష్ణారావు గారు, మాజీ కార్పొరేటర్లు శ్రీ పగుడాల బాబురావు గారు, శ్రీ తూము శ్రావణ్ కుమార్ గార్లు వారి స్వగృహానికి విచ్చేసి రాజు గారిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి వీరేశం, పిల్లి శ్రీశైలం, కాట్రాజ్ నాగేష్, నీరుడి శ్రీనివాస్, అరుణ్, కృష్ణ, శ్రీమతి భాగ్యమ్మ, శ్రీమతి మంజుల, శ్రీమతి శారద, శ్రీమతి జ్యోతి మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో కొలువైన దయామయుడు కూకట్‌పల్లి ధైర్యం గొట్టుముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి (నిలువుటద్దం ప్రతినిధి): "అధికార పదవులు ఉన్నవారు ఎందరో ఉంటారు.. కానీ ఆపదలో ఉన్న పేదవాడికి అండగా నిలిచే గుణం కొందరికే సొంతం." ఇచ్చిన మాటతో మభ్యపెట్టే రాజకీయ నాయకుల నడుమ, చేతిలో ఎలాంటి పదవి లేకపోయినా ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తూ ప్రజల మదిలో దేవుడిగా నిలుస్తున్నారు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు (జివిఆర్) అన్న.

అన్యాయంపై సమరభేరి -- పేదలకు కొండంత అభయం: కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎక్కడ ఏ పేదవాడికి కష్టం వచ్చినా, టైమ్‌తో సంబంధం లేకుండా అర్ధరాత్రి అయినా సరే స్పందించే ఏకైక నాయకుడు జివిఆర్ అన్న. అన్యాయాన్ని అరికట్టడంలో ఆయన చూపించే ధైర్యం, తెగువ నిజమైన 'మొనగాడిలా' అక్రమార్కుల గుండెల్లో నిద్రపోతోంది. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్న ఆయన తీరుకు కూకట్‌పల్లి ప్రజలు ఫిదా అవుతున్నారు.

పదవి లేకున్నా ప్రవాహంలా సేవలు: "ఒక్క హోదా, పదవి లేకపోతేనే ఈ స్థాయిలో నిరుపేదలకు సాయమందిస్తూ అండగా నిలబడుతున్నారు.. ఇక అధికారికంగా పదవి చేతికి వస్తే కూకట్‌పల్లి రూపురేఖలే మారిపోతాయి!" అని స్థానిక ప్రజలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అండగా నిలిచే నాయకుడు దొరికితే ఆ నియోజకవర్గానికే అదృష్టమని, అలాంటి ఆపద్బాంధవుడు తమకు లభించడం కూకట్‌పల్లి చేసుకున్న పుణ్యమని ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు.

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో కొత్త పెన్షన్

దరఖాస్తుల ఎంక్వైరీ పరిశీలన: మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్.......

ఆల్విన్ కాలనీ నిలువుటద్దం ప్రతినిధి: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో నూతనంగా ఆన్‌లైన్ ద్వారా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంక్వైరీ (పరిశీలన) ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా జరుగుతున్న ఎంక్వైరీ ప్రక్రియను మాజీ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు మరియు లబ్ధిదారులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ఆగస్టు నుండి అప్లై చేసిన వారికి తప్పనిసరి ఎంక్వైరీ: ఈ కార్యక్రమంలో శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ గారు మాట్లాడుతూ.. ఇటీవల ఆగస్టు నెల నుండి ఆన్‌లైన్ విధానం ద్వారా కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఎంక్వైరీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన తమ దరఖాస్తు సమయంలో సమర్పించిన అన్ని రకాల అసలు పత్రాలు (డాకుమెంట్స్) మరియు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకుని, తమకు సమీప కేంద్రాలకు స్వయంగా వెళ్లాలని సూచించారు.

అర్హులందరికీ త్వరలోనే పెన్షన్: ఎంక్వైరీ ప్రక్రియ సమర్థవంతంగా, పారదర్శకంగా పూర్తయిన వెంటనే అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ త్వరలోనే నూతన పెన్షన్లు మంజూరవుతాయని ఆయన హామీ ఇచ్చారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎంక్వైరీ కేంద్రాలు (వెరిఫికేషన్ సెంటర్స్): లబ్ధిదారులు తమ అనుకూలాన్ని బట్టి క్రింద సూచించిన కేంద్రాలకు వెళ్లి ఎంక్వైరీ పూర్తి చేసుకోవచ్చు: శంషిగూడ వార్డ్ ఆఫీస్ దత్తాత్రేయ కాలనీ సాయిబాబా టెంపుల్ ఆల్విన్ కాలనీ ఫేజ్-2 కమ్యూనిటీ హాల్

పాల్గొన్న ప్రముఖులు: ఈ పరిశీలన కార్యక్రమంలో జి.గా ముస్తఫా గారితో పాటు బి.ఎల్.ఓ (బూత్‌లు), బి.ఎల్.ఎ (బూత్‌లు), స్థానిక నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ నియామకంలో రొటేషన్ పాటించాలి

మాదిగ,అనుబంధ కులాల జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి: టీఎంజేఎఫ్

హైదరాబాద్, అక్టోబర్1; తెలంగాణ ఎస్సీ-ఎస్టీ కమిషన్ ప్రస్తుత పదవీకాలం అక్టోబర్ 3, 2026తో ముగియనున్న నేపథ్యంలో తదుపరి కమిషన్ చైర్మన్ నియామకంలో రొటేషన్ విధానాన్ని పాటించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. మాదిగ,అనుబంధ కులాల జర్నలిస్టులకు కమిషన్‌లో ప్రాధాన్యత కల్పించాలని ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఛార్జుల నాగేందర్ మాదిగ, గౌరవ అధ్యక్షులు వత్తుల రఘుపతి మాదిగ, ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్ మాదిగ డిమాండ్ చేశారు.ఈ మేరకు వారు గురువారం హైదర్ గూడ లోని ఎన్ ఎస్ ఎస్ మీడియా సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు.ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిన ముఖ్యమంత్రి,మంత్రిమండలి, కృషి చేసిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.గతంలో కమిషన్‌కు కల్పించిన ప్రాతినిధ్యాన్ని సమీక్షించి, ఒకే ఉపకులం లేదా ప్రాంతానికే పరిమితం కాకుండా మాదిగ, మాలలతో పాటు అన్ని ఎస్సీ కులాలు, ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.కమిషన్ నియామకంలో మాదిగ,అనుబంధ కులాల జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో అనుభవం ఉన్న జర్నలిస్టులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.కుల అణిచివేత, కుల వివక్ష నిర్మూలనపై దూరదృష్టి,సామాజిక సమస్యలపై అవగాహన ఉన్నవారికి కమిషన్‌లో అవకాశం కల్పించాలని అన్నారు.కుల వివక్ష, కుల బహిష్కరణ,సామాజిక వెలివేత,గ్రామస్థాయి ఘర్షణలు మొదలైన తక్షణ స్పందించకుండా,ముందుగానే సమస్యలను గుర్తించి నివారించే కార్యాచరణ ఉండాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ--బీసీ కులాల మధ్య ఘర్షణలకు దారితీసే సమస్యలను సంభాషణ, అవగాహన,చట్టపరమైన చర్యల ద్వారా పరిష్కరించే విధంగా కమిషన్ పనిచేయాలని అన్నారు.ఈ సమావేశం లో రాష్ట్ర గౌరవ సలహా దారులు మైలారపు ప్రేమ్,నుంచు లింగయ్య, పసుల తిరుపతి, జిలకర కృష్ణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కడియం నాగయ్య,దుబ్బ నగేష్, కార్యదర్శులు చెల్మెడ అనీల్,గంట వెంకన్న,మహాకాళి భిక్ష పతి, ప్రచార కార్యదర్శులు కల్వకోల్ యాదయ్య, చింత ప్రవీణ్,కోశాధికారి బొట్ల సదానందం, అధికార ప్రతినిధి పంగిడిచెరువు వెంకటేష్, సహాయ కార్యదర్శి కాడేపాక శ్రీనివాస్, సాయికుమార్ బొల్లె రాజయ్య, దరువుల శంకర్, మీసాల సైదులు, లంక స్వామి, రాయుడు, బాలకృష్ణ, రామస్వామి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కలలకు రెక్కలు... ప్రతిభకు పట్టం

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 26వ స్నాతకోత్సవం ఘనంగా
1,721 డిగ్రీలు ప్రదానం.. 300 పీహెచ్‌డీలు..
178 పతకాలు
ఐదుగురు యువ అధ్యాపకులకు 2026 ఛాన్సలర్ అవార్డులు.......

హైదరాబాద్ నిలువుటద్దం బ్యూరో ఇంచార్జ్: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 26వ స్నాతకోత్సవం అక్టోబర్ 1న హైదరాబాద్ గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జె. అనురాధ, తెలంగాణ గవర్నర్, యూనివర్సిటీ చీఫ్ రెక్టర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా తదితరులు కార్యక్రమానికి హాజరై పట్టభద్రులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రస్థానంలో కీలక మైలురాయిగా నిలిచిన ఈ స్నాతకోత్సవంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు మొత్తం 1,721 డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో 300 పీహెచ్‌డీ డిగ్రీలు ఉన్నాయి. అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 178 పతకాలను అందజేశారు. తెలంగాణ గవర్నర్, చీఫ్ రెక్టర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్య అతిథి డాక్టర్ సమీర్ వి. కామత్ పతకాలను ప్రదానం చేశారు. ఐదుగురు యువ అధ్యాపకులకు ఛాన్సలర్ అవార్డులు విశ్వవిద్యాలయ అభివృద్ధికి పరిశోధన, బోధన, విద్యార్థుల మార్గదర్శకత్వం తదితర రంగాల్లో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 2026 ఛాన్సలర్ అవార్డులను ఐదుగురు యువ అధ్యాపకులకు ప్రకటించారు. అవార్డులు అందుకున్న వారిలో స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన డాక్టర్ బి. శరవనన్, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ప్లాంట్ సైన్సెస్ విభాగానికి చెందిన డాక్టర్ జోగి మధుప్రకాశ్, స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌కు చెందిన డాక్టర్ రామచంద్రరావు యల్లా, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, పొలిటికల్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ అనుపమ ఇంగోలే, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్, సెంటర్ ఫర్ అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్‌కు చెందిన డాక్టర్ నరేష్ అన్నెం ఉన్నారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి: ఛాన్సలర్ ఈ సందర్భంగా ఛాన్సలర్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి పట్టభద్రులను అభినందిస్తూ, వారు సాధించిన విజయాలు పట్టుదల, కృషికి నిదర్శనమని అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విద్యా ప్రమాణాలు, పరిశోధన, ఆవిష్కరణలు, అంతర్జాతీయ గుర్తింపు, ఔత్సాహిక పారిశ్రామిక రంగాల్లో సాధిస్తున్న పురోగతిని ఆయన ప్రస్తావించారు.

పరిశోధనా ప్రాజెక్టులు, పేటెంట్లు, స్టార్టప్ కార్యక్రమాల ద్వారా జాతీయ అభివృద్ధికి విశ్వవిద్యాలయం అందిస్తున్న సహకారం పెరుగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ ఆసక్తిని కొనసాగిస్తూ, సానుభూతితో నాయకత్వం వహించాలని, సమానత్వం మరియు సమగ్రతను పాటించాలని సూచించారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించేందుకు తమ విద్యను బాధ్యతాయుతంగా వినియోగించాలని, నిజాయితీ, మానవత్వం, కరుణను జీవితంలో నిలుపుకోవాలని పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో కొనసాగుతున్న ప్రస్థానం

వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జె. అనురాధ 2025--26 విద్యా సంవత్సరంలో యూనివర్సిటీ సాధించిన ప్రగతి వివరించారు. 'టైమ్స్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో యూనివర్సిటీ 851--900 బ్యాండ్‌లో తన స్థానాన్ని కొనసాగించిందని తెలిపారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో 200 స్థానాలు మెరుగుపడి 2027కు 801--1000 బ్యాండ్‌కు చేరిందని వెల్లడించారు. విషయాల వారీగా కూడా యూనివర్సిటీ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. లింగ్విస్టిక్స్ 151--200, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 251--300, సోషియాలజీ 251--300, పొలిటికల్ సైన్స్ 301--400, కెమిస్ట్రీ 401--450, ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్ 501--550, బయోలాజికల్ సైన్సెస్ 651--700 బ్యాండ్లలో నిలిచినట్లు ఆమె తెలిపారు.

184 కోట్లకు పైగా విలువైన పరిశోధనా ప్రాజెక్టులు

విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం 179 క్రియాశీల పరిశోధనా ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, వాటి విలువ ?184 కోట్లకు పైగా ఉందని వైస్‌చాన్స్‌లర్ తెలిపారు. ప్రపంచంలో అత్యధికంగా ఉదహరించబడుతున్న టాప్ 2 శాతం పరిశోధకుల్లో యూనివర్సిటీకి చెందిన 34 మంది అధ్యాపకులు గుర్తింపు పొందారని చెప్పారు. ఇద్దరు అధ్యాపకులు జె.సి. బోస్ నేషనల్ ఫెలోషిప్ అందుకున్నారని వెల్లడించారు. 100 కోట్ల విలువైన 'కాపీ--ప్రాణ×' కార్యక్రమం ద్వారా ఆరు సంస్థలు, సుమారు 180 మంది పరిశోధకులతో కలిసి ఆరోగ్య రంగం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు సంబంధించిన సవాళ్లపై పరిశోధనలు చేపడుతున్నట్లు తెలిపారు. 'కాపీ×జు' కార్యక్రమం ద్వారా 140కి పైగా డీప్‌టెక్ స్టార్టప్‌లకు మద్దతు అందించినట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో ఇన్నోర్స్ ఏర్పాటు, దృష్టి లోపం ఉన్న 100 మందికి స్మార్ట్ విజన్ గ్లాసెస్ పంపిణీ, ఇంటర్‌డిసిప్లినరీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ కార్యక్రమం కింద క్యాంపస్ సదుపాయాల అభివృద్ధి, 43 మంది అంతర్జాతీయ స్కాలర్ల రాక, ఎరాస్మస్ ముండస్ జాయింట్ మాస్టర్స్ గ్రాంట్, పీఎం-2020 కింద నాలుగేళ్ల అండర్‌గ్రాడ్యుయేట్ కెమిస్ట్రీ ప్రోగ్రామ్ ప్రారంభం వంటి అంశాలను ఆమె వివరించారు. 2026--27 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ సీట్లలో 92.43 శాతం, పీజీ సీట్లలో 83.85 శాతం, అండర్‌గ్రాడ్యుయేట్ మరియు ఇంటిగ్రేటెడ్ పీజీ సీట్లలో 85.64 శాతం భర్తీ అయినట్లు తెలిపారు.

"విద్య నిరంతర ప్రయాణం"

ముఖ్య అతిథి డాక్టర్ సమీర్ వి. కామత్ పట్టభద్రులను అభినందిస్తూ, విద్యార్థులు అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తమకు నచ్చిన రంగాల్లో అవకాశాలను అన్వేషిస్తూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని అన్నారు. డీఆర్‌డీఓలో తన అనుభవాలను ప్రస్తావించిన ఆయన, సవాళ్లను ఎదుర్కొనేందుకు సహకారం, పట్టుదల, అనుకూలత అవసరమని చెప్పారు. "విద్య అనేది జీవితాంతం కొనసాగే ప్రయాణం" అని పేర్కొన్నారు. విజయానికి ఒకే ఒక మాయాజాల సూత్రం లేదని, తమకు ఆసక్తి ఉన్న రంగంలో కృషి చేయడం ద్వారా ప్రతిభను వెలికితీయవచ్చని సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌తో డీఆర్‌డీఓకు ఉన్న దీర్ఘకాలిక సహకారాన్ని, ముఖ్యంగా జు×బా ఇండస్ట్రీ అకాడమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా కొనసాగుతున్న

భాగస్వామ్యాన్ని ఆయన ప్రస్తావించారు.

వినయంతో, బాధ్యతతో ముందుకు సాగాలి: గవర్నర్

తెలంగాణ గవర్నర్, యూనివర్సిటీ చీఫ్ రెక్టర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, విద్యార్థులు తమ విద్య, నైపుణ్యాలను సమాజం మరియు దేశానికి ఉపయోగించాలని సూచించారు. విద్య కేవలం డిగ్రీలు, ఉద్యోగాలు, వృత్తిపరమైన విజయాలతో మాత్రమే పరిమితం కాదని, వ్యక్తిత్వం, విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తనలోనే నిజమైన విద్య ప్రతిబింబిస్తుందని అన్నారు. ఎంతటి విజయాలు సాధించినా వినయాన్ని కోల్పోకూడదని సూచించారు. తమ విద్యా ప్రయాణంలో తోడ్పడిన ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల సేవలను గుర్తుంచుకోవాలని, నిజాయితీ, విశాల దృక్పథంతో జీవితాన్ని ముందుకు తీసుకెళ్లాలని పట్టభద్రులకు సూచించారు. తమ జ్ఞానాన్ని సమాజం, దేశ శ్రేయస్సు కోసం వినియోగించాలని పిలుపునిచ్చారు. అత్యుత్తమ పరిశోధనలకు ప్రత్యేక పతకాలు స్నాతకోత్సవంలో పలు ప్రతిష్ఠాత్మక పతకాలను కూడా ప్రదానం చేశారు. డాక్టర్ నందివాడ రత్నశ్రీ మెడల్ ఫర్ బెస్ట్ పీహెచ్‌డీ థీసిస్ ఇన్ ఆస్ట్రోఫిజిక్స్/థియరిటికల్ ఫిజిక్స్ను దిలీప్ కుమార్ అందుకున్నారు. ప్రొఫెసర్ ఎస్. శివకుమార్ మెడల్ ఫర్ బెస్ట్ పీహెచ్‌డీ థీసిస్ ఇన్ లైఫ్ సైన్సెస్ను శ్రేయ పి.కె. అందుకున్నారు. రాజ్ నరహరి పెర్షాద్ మెడల్ ఫర్ బెస్ట్ పీహెచ్‌డీ థీసిస్ ఇన్ సంస్కృత స్టడీస్ను అక్షిత విలాస్ బర్భాడికర్ అందుకున్నారు. సరోజినీ నాయుడు మెమోరియల్ ట్రస్ట్ మెడల్, సి.బి. ఇంద్ర ఎండోమెంట్ మెడల్తో పాటు ఎస్సీ/ఎస్టీ మెడల్ను డొరోత్ దియెంగ్డోహ్ అందుకున్నారు.విద్యా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న పట్టభద్రుల ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ 26వ స్నాతకోత్సవం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విద్యా, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో సాధిస్తున్న పురోగతికి మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

అల్వాల్ చెరువు పరిశుభ్రతకు లోయోలా అకాడమీ విద్యార్థుల చొరవ

చెరువు పరిశుభ్రతకు విద్యార్థుల బృహత్ చొరవ.......
అల్వాల్ చెరువు పరిసరాల్లో లోయోలా అకాడమీ ఎం.ఎస్సీ విద్యార్థుల అవగాహన కార్యక్రమం
ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు.. ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన.......

సికింద్రాబాద్, అల్వాల్ -- నిలువుటద్దం ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల్లో పౌర బాధ్యత, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు లోయోలా అకాడమీ డిగ్రీ & పీజీ కళాశాల, అల్వాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమం ఆదర్శంగా నిలిచింది. కళాశాల నిర్వహిస్తున్న గ్రామాభివృద్ధి -- సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ద్వితీయ సంవత్సరం ఎం.ఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) విద్యార్థులు గురువారం, అక్టోబర్ 1న ఉదయం 8.30 గంటలకు అల్వాల్ చెరువు పరిసరాల్లో ప్రత్యేక పరిశుభ్రత మరియు ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెరువు పరిసరాల్లో విస్తృతంగా పరిశుభ్రత కార్యక్రమం

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అల్వాల్ చెరువు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, విచ్ఛిన్నకారిణంగా పడవేసిన చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను గుర్తించి సేకరించారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు నీటి వనరుల పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా విద్యార్థులు శ్రమించారు. చెరువులు, కుంటలు వంటి నీటి వనరుల పరిసరాల్లో ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. చెత్తను నిర్లక్ష్యంగా పడేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా తెలియజేశారు.

ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన

పరిశుభ్రత కార్యక్రమంతో పాటు విద్యార్థులు స్థానిక ప్రజలను కలిసి చెరువు పరిసరాల్లో చెత్త వేయడం, ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగించడం, వ్యర్థాలను నీటి వనరుల్లోకి చేరేలా చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ప్రజా ప్రదేశాలు, చెరువులు, నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం కేవలం ప్రభుత్వ సంస్థల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడికి ఇందులో భాగస్వామ్య బాధ్యత ఉందని విద్యార్థులు అవగాహన కల్పించారు. చెత్తను సరైన నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మున్సిపల్, స్వచ్ఛత బృందాల సమన్వయం

ఈ కార్యక్రమం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బోగేశ్వర్ రావు, డిప్యూటీ ఇంజనీర్ సందీప్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఎపీఏ) మరియు స్వచ్ఛత హై సేవా బృందం నాయకుడు ప్రదీప్ రెడ్డి సమన్వయంతో నిర్వహించబడింది.

పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సామాజిక బాధ్యతకు ప్రోత్సాహం

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరగడంతో పాటు సామాజిక సేవ, పౌర బాధ్యత, ప్రజా ప్రదేశాల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యక్ష అనుభవం లభించింది. పుస్తకాల్లో నేర్చుకునే విషయాలను సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఆచరణలో పెట్టడం విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.

కళాశాల యాజమాన్యం మార్గదర్శకత్వంలో కార్యక్రమం

లోయోలా అకాడమీ డిగ్రీ & పీజీ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డా. ఎన్.బి. బాబు, వైస్ ప్రిన్సిపాల్ బి. పీటర్, ఎక్స్టెన్షన్ ఆఫీసర్ స్టీఫెన్ అనిర్వాద మార్గదర్శకత్వం మరియు సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. కార్యక్రమాన్ని ఎక్స్టెన్షన్ ఆఫీసర్ స్టీఫెన్ అనిర్వాద సమన్వయం చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చెరువు పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు కృషి చేయడంతో కార్యక్రమం విజయవంతమైంది. "పరిశుభ్రమైన పరిసరాలు -- ఆరోగ్యకరమైన సమాజం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ కార్యక్రమం చాటి చెప్పింది.

నల్లా నరసింహులుగారి
జీవితం పోరాటం

జైలు/మరణశిక్ష రచనా వారసత్వం

శతజయంతి ఉద్దేశం అన్నింటినీ కలిపి, పత్రికలో ప్రచురించడానికి అనువుగా క్రమబద్ధంగా తయారు చేశాను.

నిలువుటద్దం అక్టోబర్ 1, 2026: నల్లా నరసింహుల పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు మార్గదర్శకం మూడుసార్లు మరణశిక్ష విధించినా వెనుకడుగు వేయని తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు నల్లా నరసింహుల శతజయంతి సందర్భంగా 'మన ఆలోచన సాధన సమితి' అక్షరాంజలి

శేరిలింగంపల్లి నిలువుటద్దం ప్రతినిధి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ పోరాట యోధుడు నల్లా నరసింహులు. పేద చేనేత కుటుంబంలో జన్మించి, తన కళ్లముందు కనిపించిన సామాజిక అసమానతలు, వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీ, అణచివేత, ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ లేకపోవడం వంటి పరిస్థితులను ప్రశ్నిస్తూ ప్రజా ఉద్యమంలోకి అడుగుపెట్టిన నల్లా నరసింహుల జీవితం పోరాటం, త్యాగం, జైలు జీవితం, న్యాయపోరాటం, రచనతో సాగింది. ఆయన ధైర్యసాహసాలను, ప్రజా ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను, చారిత్రక అనుభవాలను భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో ఆయన శతజయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్ రావు తెలిపారు.

కడవెండి గడ్డపై జననం

నల్లా నరసింహులు 1926 అక్టోబర్ 2న అప్పటి జనగామ తాలూకాలోని కడవెండి గ్రామంలో నల్లా లచ్చయ్య, లచ్చమ్మ దంపతులకు పేద పద్మశాలి చేనేత కుటుంబంలో జన్మించారు. ఆయన బాల్యం గ్రామీణ పేదరికం, చేనేత జీవితం, సామాజిక అసమానతల మధ్య సాగింది. ఆ కాలంలో కడవెండి గ్రామం విసునూరు దేశ్‌ముఖ్ రేపాక రామచంద్రారెడ్డి ఆధిపత్యంలో ఉండేది. వెట్టిచాకిరి, భూస్వామ్య ఆధిపత్యం, దోపిడీ, అణచివేత వంటి సమస్యలు గ్రామీణ ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఈ పరిస్థితులు నల్లా నరసింహుల ఆలోచనా విధానంపై గాఢమైన ప్రభావాన్ని చూపాయి.

చదువులోనూ పట్టుదల

నల్లా నరసింహులు మొదట తెలుగు మాధ్యమంలో ఆరో తరగతి వరకు చదివారు. ఆ తరువాత ఉర్దూ మాధ్యమంలో ఏడవ తరగతిని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత విద్యను కొనసాగించలేక చేనేత వృత్తిలోకి ప్రవేశించారు. పాఠశాల విద్య అక్కడితో ఆగిపోయినా, సమాజాన్ని అర్థం చేసుకునే ఆయన విద్య మాత్రం కొనసాగింది. పుస్తకాలు చదవడం, ప్రజలతో చర్చించడం, ఉద్యమ నాయకులతో పరిచయాలు పెంచుకోవడం ద్వారా సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన పెంచుకున్నారు.

ఆంధ్ర మహాసభతో ప్రజా ఉద్యమంలోకి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై చర్చలు, సంఘటిత కార్యక్రమాలు, సామాజిక చైతన్యానికి ఆంధ్ర మహాసభ ఒక వేదికగా మారిన సమయంలో నల్లా నరసింహులు కూడా ప్రజా కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభ అనంతరం గ్రామస్థాయిలో ప్రజా సంఘటనలకు మరింత ఊపు వచ్చింది. కడవెండిలో ప్రజలను సంఘటితం చేయడం, వెట్టిచాకిరి, అన్యాయాలకు వ్యతిరేకంగా చైతన్యం కల్పించడం వంటి కార్యక్రమాల్లో నరసింహులు కీలక పాత్ర పోషించారు. అలా ఒక సాధారణ చేనేత కార్మికుడి నుంచి ప్రజా కార్యకర్తగా, అనంతరం ఉద్యమ నాయకుడిగా ఆయన ఎదిగారు.

దొడ్డి కొమురయ్య మరణం ప్రభావం

కడవెండి గ్రామానికే చెందిన దొడ్డి కొమురయ్య 1946 జూలై 4న జరిగిన ఘర్షణలో మరణించడం తెలంగాణ రైతాంగ ఉద్యమ చరిత్రలో కీలక మలుపుగా నిలిచింది. ఈ సంఘటనతో కడవెండి పేరు తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యత పొందింది. అదే సామాజిక వాతావరణంలో నల్లా నరసింహులు ప్రజా కార్యకలాపాలను మరింత విస్తృతం చేశారు.

గ్రామ సంఘాల నిర్మాణంలో కీలక పాత్ర

జనగామ తాలూకాలోని అనేక గ్రామాల్లో ప్రజలను సమస్యల చుట్టూ సంఘటితం చేయడం, కార్యకర్తలను తయారు చేయడం, గ్రామస్థాయి సంఘాలను బలోపేతం చేయడం నల్లా నరసింహుల ప్రధాన కార్యక్రమాలుగా కొనసాగాయి. తరువాత ఈ గ్రామ సంఘాలే ఉద్యమ నిర్మాణానికి ముఖ్యమైన ఆధారాలుగా మారాయి. ప్రజా సంఘటనలను విస్తరించడంలో, కార్యకర్తలను సమీకరించడంలో, అగ్ర నాయకత్వానికి గ్రామస్థాయి కార్యకర్తలకు మధ్య సమన్వయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో అనేక దళాలు ఏర్పడి ఉద్యమ కార్యకలాపాలు విస్తరించాయని చారిత్రక వర్ణనలు పేర్కొంటాయి.

అజ్ఞాత జీవితం... అరణ్యాల్లో పోరాటం

1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం పాలన, భూస్వామ్య ఆధిపత్యం, వెట్టిచాకిరి వంటి సమస్యలకు వ్యతిరేకంగా సాగింది. నల్గొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో ఉద్యమం విస్తరించింది. ఉద్యమం తీవ్రతరం కావడంతో నల్లా నరసింహులు అజ్ఞాత జీవితంలోకి వెళ్లారు. గ్రామాల మధ్య సంచరిస్తూ కార్యకర్తలతో సంబంధాలు కొనసాగించడం, ప్రజా సంఘాలను నిర్మించడం, ఉద్యమ కార్యక్రమాలను నిర్వహించడం ఆయన జీవితంలో భాగమయ్యాయి. నల్లమల, రాచకొండ ప్రాంతాల అరణ్యాల్లో కూడా ఆయన అజ్ఞాత జీవితం గడిపారు.

వజ్రమ్మ... ఉద్యమంలో సహచరి

నల్లా నరసింహుల జీవితంలో ఆయన భార్య వజ్రమ్మకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. భర్త అజ్ఞాత జీవితంలో ఉన్న సమయంలో ఆమె కూడా ఉద్యమ కార్యకలాపాల్లో భాగస్వామిగా నిలిచారు. మహిళలను ఉద్యమంలో భాగస్వాములను చేయడం, వారికి సామాజిక, రాజకీయ అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో వజ్రమ్మ పాత్ర కూడా ప్రస్తావనీయమైనది. ఆమె అరెస్టయి జైలు జీవితాన్ని కూడా అనుభవించారు.

సాయుధ పోరాటం ముగిసే దశలో జైలులో ఉన్న సమయంలోనే ఆమె ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చిన సంఘటన ఆ కాలంలో ఉద్యమ కుటుంబాలు ఎదుర్కొన్న వ్యక్తిగత కష్టాలకు నిదర్శనంగా నిలిచింది.

మూడుసార్లు మరణశిక్ష... అయినా వెనుకడుగు లేదు

నల్లా నరసింహుల జీవితంలో అరెస్టులు, జైలు జీవితం, కోర్టు కేసులు ఒక పెద్ద అధ్యాయంగా నిలిచాయి. ఆయన అనేకసార్లు అరెస్టయ్యారు. కొన్ని సందర్భాల్లో జైలు నుంచి తప్పించుకున్నారు. తనపై నమోదైన కేసుల్లో కొన్ని సందర్భాల్లో ఆయన స్వయంగా తన వాదనలు వినిపించుకున్నారు. కోర్టుల్లో రాజకీయ, సామాజిక అంశాలపై కూడా తన అభిప్రాయాలను వెల్లడించేవారు. వివిధ కేసుల్లో నల్లా నరసింహులకు మూడుసార్లు మరణశిక్ష విధించబడినప్పటికీ, ఆ శిక్షలు అమలు కాలేదు. ప్రజా మద్దతు, న్యాయపరమైన పరిణామాలు, తదితర కారణాలతో ఆయన ఉరిశిక్షల నుంచి బయటపడ్డారు. ఆయన ధైర్యం, పట్టుదల, పోలీసు మరియు న్యాయపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొన్న తీరు కారణంగా జనగామ ప్రాంతంలో ఆయనను "తెలంగాణ టైగర్", "విప్లవ సింహం" వంటి పేర్లతో స్మరించేవారని ఆయన జీవిత చరిత్రల్లో పేర్కొనబడింది.

1948 తరువాత కూడా కొనసాగిన పోరాట పరిణామాలు

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైనప్పటికీ, తెలంగాణలో కమ్యూనిస్టు రైతాంగ సాయుధ పోరాటం వెంటనే ముగియలేదు. పోలీసు, సైనిక చర్యలు, అరెస్టులు, కేసులు, అజ్ఞాత జీవితం వంటి పరిస్థితులు కొనసాగాయి. ఈ కాలంలో నల్లా నరసింహులు సహా అనేక మంది ఉద్యమకారులు తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. 1951లో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని విరమించుకునే నిర్ణయం తీసుకుంది. నల్లా నరసింహులు 1951 అక్టోబర్ 21న సాయుధ పోరాట విరమణకు సంబంధించిన ప్రకటన విడుదల చేసినట్లు ఆయన జీవిత చరిత్రలో నమోదైంది. అయితే పోరాటం ముగిసిన తరువాత కూడా ఆయనపై ఉన్న కేసులు, జైలు జీవితం, న్యాయపరమైన సమస్యలు వెంటనే ముగియలేదు. 1959 జనవరి 26... జైలు నుంచి విడుదల సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం 1959 జనవరి 26న నల్లా నరసింహులు జైలు నుంచి విడుదలయ్యారు. ఆయన జీవితంలో ఇది మరో కీలక మలుపుగా నిలిచింది. చాలా సంవత్సరాల అజ్ఞాత జీవితం, అరెస్టులు, కేసులు, జైలు, మరణశిక్షల తరువాత సాధారణ ప్రజా జీవితంలోకి తిరిగి రావడం ఆయన జీవిత ప్రయాణంలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది.

పోరాట యోధుడి నుంచి చరిత్ర రచయితగా

జైలు నుంచి విడుదలైన తరువాత నల్లా నరసింహులు బొంబాయి, షోలాపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లి పార్టీ కార్యకర్తలు, ఉద్యమ సహచరులతో గడిపారు. తరువాత తన అనుభవాలను చరిత్రగా నమోదు చేయడంపై దృష్టి పెట్టారు. 1987లో తెలంగాణ సాయుధ పోరాటం 40వ వార్షికోత్సవ సందర్భంలో ఉద్యమ యోధులు తమ అనుభవాలను నమోదు చేయాలనే పిలుపు వచ్చినప్పుడు, నల్లా నరసింహులు తన జీవిత అనుభవాలను విస్తృతంగా రాశారు. ఆ రచన "తెలంగాణా సాయుధ పోరాటం --- నా అనుభవాలు" అనే పుస్తకంగా రూపుదిద్దుకుని 1989లో ప్రచురితమైంది. ఈ రచన ద్వారా నల్లా నరసింహులు కేవలం పోరాట యోధుడిగానే కాకుండా, తాను చూసిన కాలాన్ని, ఉద్యమ అనుభవాలను స్వయంగా నమోదు చేసిన వ్యక్తిగా కూడా చరిత్రలో స్థానం సంపాదించారు.

4 వేల మంది అమరుల జ్ఞాపకాలు

తెలంగాణ రైతాంగ పోరాటానికి సంబంధించిన తన అనుభవాల్లో పోరాటంలో మరణించిన సుమారు 4,000 మంది గురించి కూడా నల్లా నరసింహులు ప్రస్తావించినట్లు ఆయన రచనల ఆధారంగా చెప్పబడుతుంది. పేద రైతులకు భూమి పంపిణీ, గ్రామీణ ప్రజల సమస్యలు, ఉద్యమంలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రాణాలు కోల్పోయిన సహచరుల జ్ఞాపకాలను ఆయన తన రచనల్లో నమోదు చేశారు. అందువల్ల ఆయన రచన ఒక వ్యక్తి ఆత్మకథగా మాత్రమే కాకుండా, ఆ కాలపు సామాజిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే వ్యక్తిగత చారిత్రక ఆధారంగా కూడా ప్రాధాన్యం పొందింది.

మూడు దశల్లో నల్లా నరసింహుల జీవితం

నల్లా నరసింహుల జీవితాన్ని ప్రధానంగా మూడు దశలుగా చూడవచ్చు.

మొదటి దశ: పేద చేనేత కుటుంబంలో బాల్యం, విద్య, వృత్తి.

రెండవ దశ: ఆంధ్ర మహాసభ పరిచయం, గ్రామ సంఘాల నిర్మాణం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, అజ్ఞాత జీవితం, అరెస్టులు, జైలు, కోర్టు కేసులు.

మూడవ దశ: 1959లో జైలు నుంచి విడుదలైన తరువాతి జీవితం, గత అనుభవాల స్మరణ, రచన, చారిత్రక జ్ఞాపకాల పరిరక్షణ.

ఈ మూడు దశల సమాహారమే నల్లా నరసింహుల సంపూర్ణ జీవిత ప్రయాణాన్ని నిర్మించింది.

1993 నవంబర్ 5న కన్నుమూత

1926 అక్టోబర్ 2న జన్మించిన నల్లా నరసింహులు 1993 నవంబర్ 5న మరణించారు. సుమారు 67 సంవత్సరాల జీవితంలో తెలంగాణ చరిత్రలోని అత్యంత కీలకమైన దశలను ఆయన ప్రత్యక్షంగా అనుభవించారు.

కడవెండి గ్రామంలో ప్రారంభమైన ఆయన జీవితం జనగామ ప్రాంత ప్రజా ఉద్యమం, తెలంగాణ రైతాంగ పోరాటం, అజ్ఞాత జీవితం, జైలు, న్యాయపోరాటం, రచన వరకు సాగింది. మరణానంతరం కూడా ఆయన పేరు కడవెండి, జనగామ ప్రాంతం, తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కొనసాగుతోంది.

"చరిత్రను మరవకూడదు... భవిష్యత్ తరాలకు అందించాలి"

నల్లా నరసింహుల జీవితాన్ని కేవలం ఒక వీరగాథగా చూడకుండా, ఆయన జీవించిన కాలంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులతో కలిపి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని మన ఆలోచన సాధన సమితి పేర్కొంది. ఆయన జీవితం ద్వారా నిజాం పాలన కాలం నాటి గ్రామీణ వ్యవస్థ, భూస్వామ్య సంబంధాలు, వెట్టిచాకిరి, ఆంధ్ర మహాసభ ద్వారా వచ్చిన ప్రజా చైతన్యం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, 1948 తరువాతి పరిణామాలు, దీర్ఘకాల జైలు జీవితం, చివరకు తన అనుభవాలను రచనగా భద్రపరిచిన విధానం వంటి అనేక చారిత్రక అంశాలను అర్థం చేసుకునే అవకాశం ఉందని సమితి తెలిపింది.

అక్టోబర్ 2న శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలి

నల్లా నరసింహుల పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో ఆయన శతజయంతి ఉత్సవాలను అక్టోబర్ 2న గ్రామ గ్రామాన, అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని మన ఆలోచన సాధన సమితి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ, నల్లా నరసింహుల పోరాట పటిమ, ధైర్యసాహసాలు, ప్రజా సమస్యలపై ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి చారిత్రక అధ్యయనానికి ఉపయోగపడే అంశాలని పేర్కొన్నారు. వెట్టి చాకిరీ, దోపిడీ, అణచివేత, అప్రజాస్వామిక పాలనా విధానాలు, భూస్వామ్య ఆధిపత్యం వంటి చారిత్రక అంశాలను నేటి సమాజం తన కాలానుగుణ సందర్భంలో అధ్యయనం చేసుకోవాలని ఆయన అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేసి, వారి జయంతులను నిర్వహించడం ద్వారా వారి పోరాట వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించవచ్చని తెలిపారు. "నల్లా నరసింహులు గారి పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలు, ప్రజా చైతన్యానికి చేసిన కృషి భవిష్యత్ తరాలకు చేరాలి. ఆయన శతజయంతిని విస్తృతంగా నిర్వహించడం ద్వారా చరిత్రను స్మరించుకోవడంతో పాటు, నేటి తరానికి ఆ చరిత్రను పరిచయం చేయగలం" అని కటకం నర్సింగ్ రావు పేర్కొన్నారు. నల్లా నరసింహుల జీవితం --- ఒక వ్యక్తి కథ మాత్రమే కాదు... ఒక చారిత్రక కాలానికి అద్దం కడవెండి గ్రామంలోని పేద చేనేత కుటుంబంలో జన్మించిన ఒక యువకుడు తన కాలంలోని సామాజిక పరిస్థితులతో ప్రభావితమై ప్రజా ఉద్యమంలోకి ప్రవేశించడం, గ్రామ సంఘాలను నిర్మించడం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడం, అజ్ఞాత జీవితం గడపడం, అరెస్టులు, జైలు, మూడుసార్లు మరణశిక్షలను ఎదుర్కోవడం, సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం విడుదల కావడం, చివరకు తన అనుభవాలను పుస్తక రూపంలో భద్రపరచడం --- నల్లా నరసింహుల జీవితం ఎన్నో మలుపులతో కూడిన చారిత్రక ప్రయాణం. ఆయన జీవితం తెలంగాణ చరిత్రలో ఒక ముఖ్యమైన పోరాట వారసత్వం. ఆయన అనుభవాలు చరిత్రను అధ్యయనం చేసే భవిష్యత్ తరాలకు ఒక ముఖ్యమైన జ్ఞాపకంగా నిలిచిపోతాయి.

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027